క్లుప్తంగా

ఎంఎల్‌హెచ్‌పీల సమ్మెకు సీఐటీయూ మద్దతు



లక్ష్మీపురం: ఎంఎల్‌హెచ్‌పీల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె పోరాటానికి సీఐటీయూ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్న జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు తెలిపారు. కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టిన దీక్ష పదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా శిబిరాన్ని సందర్శించిన నాయకులు మాట్లాడుతూ ఆరు సంవత్సరాల తర్వాత రెగ్యులరైజ్ చేస్తాం అని ఇచ్చిన హామీని నిలుపుకోవాలని, గతంలో నేషనల్ హెల్త్ మిషన్ అన్ని క్యాడర్లకు ఏ విధంగానైతే వేతనాలు అన్ని క్యాడర్లకు 23 శాతం వేతనం పెంచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈపీఎఫ్ సౌకర్యం కల్పించాలని, క్లినికల్ అద్దెలు చెల్లింపు కోసం చేపట్టిన న్యాయమైన పోరాటానికి సీఐటీయు మద్దతు తెలియజేస్తుందన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, నాయకులు షేక్ ఖాసిం షహీద్ పాల్గొన్నారు.

శాస్త్ర పరిశోధనలపై చైతన్యం కలిగించాలి

లక్ష్మీపురం:సామాజిక మాధ్యమాల్లో సైన్స్ విషయాల కంటే సెన్సేషనల్ అంశాలే ఎక్కువగా వైరల్ అవుతున్నాయని, సైన్స్ ఫర్ సొసైటీ అనే ఆలోచన సమాజానికి కల్పించడానికి స్వచ్ఛంద సంస్థలు, అభ్యుదయవాదులు, మేధావులు ప్రయత్నించాలని మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి అన్నారు. గుంటూరులోని అరండల్‌పేట అవగాహన సంస్థకార్యాలయంలో బుధవారం అశాస్త్రీయ అంశలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ బెనారస్ యూనివర్సిటీలో భూత వైద్య కోర్సులను ప్రవేశపెట్టడం లాంటి వాటి ద్వారా అశాస్త్రీయ భావజాల వ్యాప్తికి బలమైన వ్యవస్థను విస్తరింపజేసే ప్రచారాలు ముందుకు వస్తున్నాయన్నారు. ఈ చర్చలో విశ్లేషకులు అమరాచారి, గాయకులు రాజశేఖర్, విద్యావేత్త చంద్రయ్య పాల్గొని ప్రసంగించారు.

అండర్-7 చెస్ విజేతలుగా గణేష్ కార్తికేయ, ఆధ్యశ్రీ

గుంటూరు వెస్ట్: నైట్ క్యాజిల్స్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక వికాస్ నగర్‌లోని స్టెప్పింగ్ స్టోన్స్ స్కూల్‌లో నిర్వహిస్తున్న అండర్-7 బాలబాలికల చెస్ పోటీలు ముగిశాయి. బాలుర విభాగంలో దూండీ గణేష్ కార్తికేయ ప్రథమ స్థానం పొందగా తక్షయ్ హార్దిక్ ద్వితీయ స్థానం పొందారు. బాలికల్లో ఆధ్యశ్రీ ప్రథమ, రుద్విశ్రీ ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. అనంతరం విజేతలకు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్.రవీంద్ర రాజు, స్కూల్ డైరెక్టర్ శ్రీకాంత్ ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో పోటీల నిర్వాహకుడు వైవీకే చక్రవర్తి పాల్గొన్నారు.

సీనియర్ అథ్లెట్స్‌కు ఘన సత్కారం



గుంటూరు వెస్ట్: వరల్డ్ అథ్లెటిక్ డేను పురస్కరించుకుని జిల్లా అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బీఆర్ స్టేడియంలో సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు దేశంలో ఒక ప్రత్యేక స్థానముందని చెప్పారు. వివిధ దేశాలకు క్రీడాకారులు రాయబారులుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. జిల్లా అథ్లెటిక్ సంఘం కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ అనేక దశాబ్దాలుగా క్రీడలకు సేవలందిస్తున్నామని చెప్పారు. అనంతరం నరసింహారెడ్డితోపాటు జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చల్లా వెంకటేశ్వరరెడ్డి, కొసనా వేణుగోపాల్‌లు క్రీడాకారులను ఘనంగా సత్కరించారు.

యువత శ్రీరాముడుని ఆదర్శంగా తీసుకోవాలి



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై బుధవారం పాదుకా పట్టాభిషేకంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. మల్లాది కైలాసనాథ్ ప్రవచిస్తూ అయోధ్యాకాండలో అనేక ధర్మసూక్ష్మాలు తెలియజేస్తాయని అన్నారు. ఇది ధైర్యవంతుడి లక్షణమని చెప్పారు. ఈనాటి యువత శ్రీరాముడుని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.

మహిళా బాలల గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: బృందావన్‌గార్డెన్స్‌లోని మహిళా బాలల గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. శిక్షణా శిబిరాన్ని గ్రంథాలయాధికారులు బి.శకుంతల, పి. సత్యశిరీష పర్యవేక్షించారు.

టౌన్ ప్లానింగ్‌లో అవినీతిపై రచ్చ

- అక్రమ నిర్మాణాలపై కొరవడిన పర్యవేక్షణ
- ప్రభుత్వ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలపై ఉదాసీనత
- కార్పొరేషన్‌కు రూ.30 కోట్ల నష్టం
- కౌన్సిల్‌లో టౌన్‌ప్లానింగ్ విభాగంపై వాడివేడిగా చర్చ



కౌన్సిల్ సమావేశంలో వాదులాడుకుంటున్న టీడీపీ, వైఎస్సార్ సీపీ సభ్యులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ విభాగంలో అధికారుల అవినీతిపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నగర పరిధిలో అనధికార కట్టడాలు జరుగుతున్నా చూసీచూడనట్లు ఉంటున్నారని, ప్రభుత్వ స్థలాలు కబ్జా చేసి ఇళ్లు నిర్మించుకుని వాటిని అమ్ముకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యేలు, కౌన్సిల్ సభ్యులు టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై కౌన్సిల్ వేదికగా మండిపడ్డారు. బుధవారం ఉదయం 11.30 గంటలకు కౌన్సిల్ సమావేశం ప్రారంభమైంది. తొలుత మేయర్‌గా ఎన్నుకున్నందుకు మేయర్ రవీంద్రకు సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. వైఎస్సార్ సీపీ సభ్యులు లేచి నూతనంగా ఎన్నికైన మేయర్ రవీంద్రను సన్మానించారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాస్, సీహెచ్ శ్రీనివాస్, వెంకటకృష్ణయ్య, సెక్రటరీ బి.శ్రీనివాస్, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌ఈడీ లైట్లు వలన ప్రమాదాలు.. ఎమ్మెల్యే గళ్లా మాధవి

నగరంలో జాతీయ నాయకుల విగ్రహాలు పెట్టుకోవాలంటే రూల్స్ మాట్లాడతారు.. యథేచ్ఛగా హోర్డింగ్స్ ఏర్పాటు చేసి ఎల్‌ఈడీ బోర్డుల వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వెస్ట్ ఎమ్మెల్యే గళ్లా మాధవి సభలో అధికారులను నిలదీశారు. నగరంలో అనధికార కట్టడాలు పెరిగిపోతున్నాయని, ఒక్క ఫ్లోర్‌కు అనుమతి తీసుకుని.. ఐదు ఫ్లోర్ల నిర్మాణం చేసుకుంటున్నారని ఆరోపించారు. అధికారుల అవినీతి పెరిగిపోయిందని ధ్వజమెత్తారు. పశ్చిమ నియోజకవర్గంలో చాలా ప్రాంతాల్లో వీధి లైట్లు లేవని.. దీని వలన అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

కౌన్సిల్ సభ్యుల ప్రశ్నలను రికార్డు చేయాలి

సమావేశంలో ప్రజాప్రతినిదులు సమావేశం దృష్టికి తీసుకొచ్చిన ప్రతి ప్రశ్నను రికార్డ్ చేయాలని మేయర్ రవీంద్ర, అధికారులకు సూచించారు. వారు అడిగే ప్రతి ప్రశ్నకు రాత పూర్వకంగా సమాధానం ఇవ్వాలని చెప్పారు. నగరంలో జరిగే అభివృద్ధి పనుల్లో స్థానిక కార్పొరేటర్ భాగస్వామ్యం తప్పనిసరి అన్నారు.

ప్రభుత్వ స్థలాలు కబ్జా చేస్తున్నా..

తూర్పు నియోజకవర్గం 54వ డివిజన్‌లో సీలింగ్ ల్యాండ్‌లో నిర్మాణం జరుగుతుందని.. 389/సీ5 మీద ప్లాన్ తీసుకుని 387/సీ3 సీలింగ్ భూమిలో నిర్మాణం చేపడుతున్న విషయం 4 నెలలుగా అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఫలితం లేదని స్థానిక కార్పొరేటర్ మల్లవరపు రమ్య, అధికారుల తీరుపై మండిపడ్డారు. కార్పొరేషన్ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా కోర్టులో కేసులు ఉన్నాయనే పేరుతో పట్టించుకోవడం లేదని కార్పొరేటర్ పోలవరపు జ్యోతి అధికారులను ప్రశ్నించారు. కాకుమానువారితోటలో కార్మిక శాఖకు చెందిన స్థలం దానిలో చాలా భాగం అన్యాక్రాంతానికి గురైందని..అందులో ఇంటి నిర్మాణం చేపట్టారని, దీనిపై ఫిర్యాదులు అందిన పట్టించుకోవడం లేదని 55వ డివిజన్ కార్పొరేటర్ అంబేడ్కర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

నల్లపాడు చెరువును సుమారు రూ.150 కోట్లతో అభివృద్ధి చేస్తే కరెంట్ పోయినప్పటికి, మ్యాన్ పవర్ లేకపోయినప్పటికి గ్రావిటీ ఫోర్స్ ద్వారా నగరానికి నీటి సరఫరా చేయవచ్చని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం పేర్కొన్నారు. అనధికార లేఅవుట్స్, కాంట్రాక్టర్ల వద్ద పర్సంటేజ్‌లు తీసుకోవడం ఇలా రూల్స్‌కు విరుద్ధగా చేస్తున్నారు కాబట్టే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని.. రూల్స్‌ను సక్రమంగా పాటిస్తే ఎటువంటి సమస్యలు రావన్నారు. – ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం

విలీన గ్రామాల్లో తాగునీటి సమస్య

తాగునీటి సరఫరాకు ప్రణాళిక లేకపోవడం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పేర్కొన్నారు. విలీన గ్రామాల్లో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని చెప్పారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పేర్కొన్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

– బూర్ల రామాంజనేయులు, ఎమ్మెల్యే, ప్రత్తిపాడు

మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి



రవీంద్రనాథ్ ఠాగూర్, అల్లూరి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న సుబ్బరత్నమ్మ, ఝాన్సీలక్ష్మి



రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అవగాహన సంస్థ సభ్యులు

గుంటూరు ఎడ్యుకేషన్: దేశం గర్వించే స్థాయిలో జాతీయ గీతాన్ని అందించిన రవీంద్రనాథ్ ఠాగూర్ మహనీయుడని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ పేర్కొన్నారు. బుధవారం అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి, మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ గీతాంజలి కావ్యాన్ని రచించిన రవీంద్రనాథ్ ఆసియాలోనే తొలిసారిగా నోబుల్ బహుమతి అందుకున్నారని తెలిపారు. మన్యం వీరునిగా ప్రజల గుండెల్లో నిలిచిన అల్లూరి సీతారామరాజు బ్రిటీషు పాలకులను గడగడలాడించారని కొనియాడారు. కార్యక్రమంలో ఉప గ్రంథ పాలకురాలు కె.ఝాన్సీలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ ఎం. సీతారామయ్య, గ్రంథ పాలకులు కె.చిన్నపరెడ్డి, ఎన్.నాగిరెడ్డి, టి.విజయ్‌కుమార్, కోటేశ్వరి, శాంతిబాయి, అచ్చమ్మ పాల్గొన్నారు.

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో...

లక్ష్మీపురం: రవీంద్రనాథ్ ఠాగూర్ సాహిత్యాన్ని ప్రస్తుత తరం అధ్యాయనం చేయాల్సి అవసరం ఉందని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. జొంకరోడ్డులోని రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ తన సాహిత్యం ద్వారా ఠాగూర్ దేశంలో కుల,మత, వర్గాలకతీతంగా మానవుడు తయారు కావాలని అభిలషించారన్నారు. విశ్రాంత ఇంజినీర్ ఎన్.సదాశివం మాట్లాడుతూ రవీంద్రుడు కేవలం రచయితగానే ఉండి పోక బాలల హృదయాలను వికసింపజేయడానికి ప్రాచీన గురుకులాల తరహాలో శాంతినికేతన్ ఏర్పరిచి ఆతరువాత విశ్వభారతి విశ్వవిద్యాలయాన్ని స్థాపించారన్నారు. మహాత్మగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, పటేల్ లాంటి జాతీయ నాయకులకు రవీంద్రనాథ్ ఠాగూర్ స్ఫూర్తిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు నరసింహారావు, జనార్ధనరావు, పీటర్ పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని వారం రోజులు అందుబాటులో ఉంచాలి



వెంకటేశ్వరరావుకు వినతి పత్రం సమర్పిస్తున్న మురళీమోహన్, అభ్యర్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగుల కోసం ప్రాంతీయ గ్రంథాలయాలు వారంలో ఏడు రోజులపాటు తెరిచే ఉంచాలని గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావుకు ఓల్డ్ లైబ్రరీ ఫ్రెండ్స్ అసోసియేషన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఈ మేరకు పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులతో కలసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ కొలువుల కోసం డీఎస్సీకి సన్నద్ధమవుతున్న పేద, మధ్య తరగతి అభ్యర్థులు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి గ్రంథాలయానికి వచ్చి చదువుకుంటున్నారని తెలిపారు. ప్రతి గురువారం, రెండో శనివారం గ్రంథాలయానికి సెలవు కావడంతో అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని డీఎస్సీ పరీక్షలు ముగిసే వరకు గ్రంథాలయాన్ని వారంలో అన్ని రోజులూ తెరిచే ఉంచేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో రవికుమార్, పవన్‌కుమార్, ప్రతాపరెడ్డి, వీరయ్య, నాగేశ్వరరావు నాయక్, గోపీచంద్, వెంకటలక్ష్మి, లత, జ్యోతి, మౌనిక పాల్గొన్నారు.

మురుగు కదలితే ఒట్టు

- పారిశుద్ధ్య సమస్యలలో బ్రాడీపేట
- దోమల ధాటికి విషజ్వరాల పాలవుతున్న స్థానికులు
- చోద్యం చూస్తున్న నగరపాలక సంస్థ అధికారులు



బ్రాడీపేట 4/13లో నివాస గృహాల మధ్య సైడ్ డ్రెయిన్‌లో పేరుకుపోయిన మురుగు, చెత్త

లక్ష్మీపురం: నగర నడి బొడ్డున ఉన్న బ్రాడీపేట అంతర్గత వీధుల్లో పారిశుద్ధ్య సమస్యలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. 1,2,3,4,5,లైన్లలోని అంతర్గత అడ్డరోడ్లలోని డ్రెయిన్లు అస్తవ్యస్తంగా మారాయి. శానిటరీ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులతో రోడ్లు, చెత్త సేకరణ చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. రోజు చెత్త సేకరణ చేసే వారు కూడా సకాలంలో చెత్త సేకరణ చేయడం లేదని చెబుతున్నారు. దీంతో నివాస గృహాలలో, నివాస గృహాల మధ్య చెత్త కుప్పలు అడుగడుగున పేరుకు పోయి కనిపిస్తున్నాయి. దీని వల్ల నివాస గృహాల్లో నుంచి బయటకు రావాలంటే ముక్కులు మూసుకోవాల్సి వస్తుందని చెబుతున్నారు. నివాస గృహాల మధ్య ఉన్న సైడ్ డ్రెయిన్ల మురుగు తొలగించక పోవడంతో మురుగు, చెత్త నిల్వ చేరి దుర్వాసన వెదజల్లుతోంది.

అసంఘటిత కార్మికులు ఈ-శ్రమ నమోదు చేసుకోవాలి

లక్ష్మీపురం: ప్రతి అసంఘటిత కార్మికులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-శ్రమ పోర్టల్ నమోదు చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సయ్యద్ జియావుద్దీన్ కోరారు. మంగళగిరి రోడ్డులోని వాసవి సేల క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఈ-శ్రమ అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయమూర్తి సయ్యద్‌జియావుద్దీన్ మాట్లాడుతూ ఈ-శ్రమ పోర్టల్‌లో నమోదు అయిన వారికి ప్రమాదంలో మృతిచెందినా, అంగవైకల్యం కలిగినా బాధిత కుటుంబానికి రూ.2 లక్షలు ఆర్థిక సాయం అందుతుందని చెప్పారు. న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ న్యాయవాది కట్టా కాళీదాసు మాట్లాడుతూ ఈ-శ్రమ పోర్టల్‌లో సభ్యత్వం వల్ల కలిగే లబ్ధి గురించి వివరించారు. ఉప కార్మిక కమిషనర్ ఎ.గాయత్రిదేవి మాట్లాడుతూ 16 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు తమ ఆధార్ కార్డు, లింక్ కాబడిన ఫోన్ నంబరు, బ్యాంకు అకౌంట్ నంబరు వివరాలు తీసుకుని దగ్గరలో ఉన్న సీఎస్‌సీ సెంటర్, కార్మిక శాఖ కార్యాలయం వెళ్లి నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాల కోసం 9492555157ను సంప్రదించాలని కోరారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పెమ్మసాని పూజలు




కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నగరంపాలెం: విశ్వ బ్రాహ్మణులు సృష్టి ఆరంభం నుంచి సమాజానికి అవసరమైన వస్తువులను తయారుచేసి అందించారని కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. అమరావతి రోడ్డులోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో ఆరాధన, గురుపూజ మహోత్సవాలు బుధవారం నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాభిషేకాలు, పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కేంద్ర సహాయమంత్రి చంద్రశేఖర్‌ను సత్కరించి, బ్రహ్మం జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్ని విధాల వారిని ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశ్వకర్మ యోజన, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ పథకాలు తీసుకొచ్చారని అన్నారు. దేవస్థానం కార్యదర్శి ఉమ్మడోజు నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఏపీఐఐసీ చైర్మన్ డేగల ప్రభాకర్, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సింహాద్రి సత్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులు గట్టి శ్రీనివాసరావు, వాలిచర్ల ప్రసాద్, మేడూరి శివరామబ్రహ్మం, గురు బ్రహ్మచారి, బ్రహ్మముడి కోటేశ్వరరావు, డాక్టర్ హనుమంతరావు, బ్రహ్మం, రమేష్, శరత్‌బాబు, ఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తలసీమియా.. రక్తం పీల్చేస్తుంది..

- జీజీహెచ్‌లో అందిస్తున్న చికిత్స
- వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలి



గుంటూరు మెడికల్: తలసీమియా వ్యాధి సోకితే ప్రాణాలపై ఆశలు వదులుకోవటమే. వ్యాధికి గురైన చిన్నారికి జీవితాంతం రక్తం ఎక్కిస్తూనే ఉండాలి. ఏ క్షణానైనా రక్తం ఎక్కించడం ఆపివేస్తే కొద్ది రోజుల్లోనే పిల్లవాడు చనిపోతాడు. వ్యాధిపై అవగాహన కలిగి ఉండటం ద్వారా పుట్టబోయే పిల్లలు వ్యాధి బారిన పడకుండా కాపాడవచ్చు. తలసీమియాపై అవగాహన కల్పించేందుకు మే 8న ప్రపంచ తలసీమియా దినోత్సవం నిర్వహిస్తున్నారు.

వ్యాధికి కారణాలు..

వ్యాధి జన్యుపరమైనది. ఎముక మూలుగలో హిమోగ్లోబిన్ ఉండే రక్తకణాల ఉత్పత్తి నిలిచిపోవటాన్ని తలసీమియా వ్యాధి అంటారు. ఇది తల్లిదండ్రుల ద్వారా పిల్లలకు సోకుతుంది. తలసీమియా సోకిన వారికి జీవితాంతం రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. హిమోగ్లోబిన్ నిల్వలు తగ్గిన ప్రతిసారి కృత్రిమంగా రక్తం ద్వారా హిమోగ్లోబిన్‌ను అందించాలి. సకాలంలో అందించకపోతే ప్రాణాలు పోతాయి.

వ్యాధి లక్షణాలు..

పుట్టిన బిడ్డ మూడు నెలల వయస్సు నుంచి 18 నెలల వయస్సులోపే ఈ వ్యాధి బయట పడుతుంది. ముఖం పీక్కుపోవటం, బాల్యంలోనే ముడతలు పడినట్టుగా తయారవుతుంది. శరీర రంగుతేడాగా ఉండి పాలిపోయినట్టుగా మారుతుంది. శారీరక ఎదుగుదల ఉండదు. బొడ్డు భాగంలో వాపు ఉంటుంది. తరచుగా అనారోగ్యానికి గురవుతారు. బాధితుల్లో అడుగేస్తే ఆయాసం, తీవ్రస్థాయిలో నీరసం, జీర్ణశక్తి మందగించడం, పొట్ట లావు ఎక్కడం, ఎముకల్లో పటుత్వం తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఐరన్ తక్కువగా ఉండాలి. కాని శరీరంలోకి రక్తం ఎక్కించే సమయంలో ప్రవేశించే ఐరన్ ఓకేచోట కుప్పలాగా పోగుబడి మూత్ర పిండాలు, కాలేయం, గుండె సమస్యలు తలెత్తుతాయి.


జిల్లాలో 124 మంది బాధితులు

తలసీమియాతో ప్రతి ఏడాది వేలాదిమంది పిల్లలు జన్మిస్తున్నట్లు వైద్య గణాంకాలు వెల్లడిస్తున్నాయి. జిల్లాలో ప్రతినెలా చిన్నారులు తలసీమియా వ్యాధి సోకి చికిత్స కోసం జీజీహెచ్‌కు వస్తున్నట్లు పిల్లల వైద్య నిపుణులు తెలిపారు. ప్రస్తుతం గుంటూరు జీజీహెచ్‌లో 124 మంది చిన్నారులు చికిత్స పొందుతున్నారు. చిన్నపిల్లల వైద్య విభాగంలో ప్రతిరోజూ బాధితులకు ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. బాధితులకు క్రమం తప్పకుండా రక్తం కూడా ఉచితంగా ఎక్కిస్తున్నారు. ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా తలసీమియా బాధితులకు పిల్లల వైద్య విభాగంలో ఓపీ వైద్య సేవలు అందిస్తున్నారు. మందులు కూడా ఉచితంగా అందజేస్తున్నారు.

బాధితులకు రూ.10 వేలు ఆర్థిక సాయం

డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో తలసీమియా వ్యాధిని ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చారు. ప్రతినెలా బాధితులకు రూ.10వేలు ఆర్థిక సాయం పెన్షన్ రూపంలో అందిస్తున్నారు. బాధితులకు అవసరమయ్యే వైద్య సేవలన్ని ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది.


ఉచితంగా వైద్య సేవలు



జిల్లా వ్యాప్తంగా ఉన్న తలసీమియా బాధితులకు ప్రభుత్వం అండగా ఉండి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్య సేవలు అందించడంతోపాటు మందులు కూడా అందిస్తోంది. జీజీహెచ్‌లోని డైక్ సెంటర్ ద్వారా తలసీమియా బాధితులకు కావాల్సిన అన్ని వైద్య సేవలను అందిస్తున్నాం. ప్రతి శుక్రవారం పిల్లల వైద్య విభాగంలో ప్రత్యేక ఓపీ నిర్వహిస్తున్నాం. ప్రతిరోజూ తలసీమియా బాధితులకు ఉచితంగా రక్తం ఎక్కిస్తున్నాం.

– డాక్టర్ యశస్వి రమణ, జీజీహెచ్ సూపరింటెండెంట్

ముందస్తుగా గుర్తించవచ్చు....



వ్యాధిని పసిగుడ్డు గర్భంలో ఉన్న సమయంలో వ్యాధి నిర్ధారణ చేసి గుర్తించవచ్చు. పెళ్లికి ముందే వధూవరులకు కంప్లీట్ బ్లడ్ కౌంట్ సీబీసీ, హెచ్‌బీఏ 2 లెవల్ పరీక్షలు చేయించాలి. వ్యాధి కుటుంబాలకు జన్యుపరమైన పరీక్షలు చేయాలి. వ్యాధిపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించడం ద్వారా వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకునే అవకాశం కలుగుతుంది.

– డాక్టర్ బూసిరెడ్డి దీప్తి, ప్రసూతి, సంతానసాఫల్య వైద్య నిపుణురాలు, గుంటూరు

దాడి చేసి బెదిరించిన వ్యక్తిపై కేసు

లక్ష్మీపురం: దాడి చేసి బెదిరించిన వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. గౌతమినగర్ 3వ లైన్‌కు చెందిన షేక్ మక్తుం బాషా తాపీ పని చేస్తుంటాడు. ఇద్దరు కుమార్తెలు. ఇద్దరికి వివాహం అయింది. రెండో కుమార్తెను నిడుముక్కల గ్రామానికి చెందిన షేక్ సుభాని కుమారుడు షేక్ షబ్బీర్ బాషా అలియాస్ తాడేపుల్ ఖాద్రికి ఇచ్చి రెండేళ్ల క్రితం వివాహం చేశాడు. అల్లుడు షబ్బీర్ బాషా నిడుముక్కల 101 దర్గాల ధర్మకర్తగా ఉంటారు. ప్రతి రోజు ముక్తుం బాషా భార్య ఇద్దరు ఉదయం సాయంత్రం దర్గాలో సేవ చేస్తు ఉంటారు. రెండు నెలల క్రితం రంజాన్ మాసం పూర్తి అయిన తరువాత బాజీ బాబా ఉరుసు రోజు అల్లుడు షబ్బీర్ బాషా అన్న షేక్ అహ్మద్ బాషాతో వివాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో ఇరువురు తాడికొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. అయిన అహ్మద్ బాషా, మక్తుం బాషాపై ప్రతీకారం తీర్చుకునేందుకు ఈనెల 3వ తేదీన అరండల్‌పేట 10వ లైన్‌లో వెళుతుండగా వాహనాన్ని అడ్డగించి మక్తుం బాషాపై దాడి చేసి తీవ్రంగా గాయపరచి, హతమార్చేందుకు ప్రయత్నించాడు. గమనించిన స్థానికులు అడ్డుకోవడం అహ్మద్ బాషా అక్కడ నుంచి వెళ్లిపోయాడు. మక్తుం బాషా అరండల్‌పేట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోరాట యోధుడు అల్లూరి చిరస్మరణీయుడు



అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న స్టెప్ సీఈఓ చంద్రముని, రాధిక, విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: బ్రిటీషు పాలకులను గడగడలాడించిన పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడని యువజన సర్వీసులశాఖ సీఈఓ ఆర్.చంద్రముని పేర్కొన్నారు. బుధవారం బ్రాడీపేటలోని జయంతి నిలయంలో అల్లూరి వర్ధంతి నిర్వహించారు. చంద్రముని మాట్లాడుతూ మన్యం ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్యం కోసం పోరాడిన అల్లూరి 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణత్యాగం చేసిన విప్లవజ్యోతి అని, రెండేళ్లపాటు బ్రిటీషర్లకు కంటి మీద కునుకు లేకుండా చేసినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ ప్రతినిధి డాక్టర్ బి.కృష్ణయ్య, సీనియర్ సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు, స్టెప్ మేనేజర్ బి.రాధిక, అధ్యాపకుడు శ్రీహర్ష, విద్యార్థులు పాల్గొన్నారు.

- గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన ధర్నాలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, మొహ్మద్ ఖాలీద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 డిమాండ్ల సాధన కోసం మూడు దశల్లో చేపట్టిన పోరాటంలో భాగంగా రెండో దశలో ధర్నాలు తలపెట్టినట్లు చెప్పారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో మాక్ డ్రిల్

పట్నంబజారు: ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం పోలీస్ అధికారులు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాద స్థావరాలపై భారత్ దాడులు నిర్వహించిన నేపథ్యంలో ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో అవగాహన కలిగించే విధంగా డ్రిల్ చేపట్టారు. గుంటూరు జిల్లా అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) జీవీ రమణమూర్తి, ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఏ హనుమంతు, ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, పాత గుంటూరు పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ వై.వీర సోమయ్య హాజరై మాక్ డ్రిల్ నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో ఏ విధంగా వ్యవహరించాలని చేసి చూపించారు.

రూ.4 లక్షల విలువ చేసే సొత్తు చోరీ

లక్ష్మీపురం: ఇంట్లో చోరీ ఘటనపై బుధవారం అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. బ్రాడీపేట 4/14వ అడ్డరోడ్డు ప్రాంతానికి చెందిన భారతి దేవి, జనవరిలో ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న కుమారుడు గుడిపూడి వెంకట రమేష్ ఇంటికి వెళ్లింది. నాలుగు నెలల తరువాత ఇంటికి వచ్చి చూడగా ఇంటి తలుపులు పగల గొట్టి ఉన్నాయి. ఇంట్లో ఉన్న 10 గ్రాముల బంగారం, వెండి, పంచలోహ దేవుని విగ్రహాలు, చీరలు ఇతర వస్తువులు సుమారు రూ.4 లక్షల విలువ చేసే వస్తువులు చోరీకి గురి అయ్యాయి. బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.